# ..రంభ ...... గంగ

(మిగిలిన కథ)

-- నోరి రాధిక

అంబర్ ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. పార్వతి భోజనం వడ్డిస్తూ "ఇవాళ ఇంత ఆలస్యం అయిందేమిరా? ఇందాకటినుండీ నిద్ర ఆపుకుంటున్నాను" అంది.

"స్వీటీతో బయటికి వెళ్ళానమ్మా! తనని వాళ్ళింటి దగ్గర దింపి వచ్చేసరికి కొంచెం ఆలస్యం అయింది" అన్నాడు మెల్లిగా అంబర్. ఈమధ్య అంబర్ కి ఈ డైలాగు బాగా పరిపాటి అవటంతో పార్వతికదేమీ కొత్తగా అనిపించలేదు.

"అంబర్! మీ ఇద్దరూ ఒక నిర్ణయానికి రావటానికి ఇంకా ఎన్ని రోజులు కావాలి? ఇంకా ఎన్నాళ్ళు ఇలా తిరిగితే ఒకరికొకరు బాగా తెలుస్తారని అనుకుంటున్నారు?" కొంచెం అసహనంగా ప్రశ్నించింది పార్వతి. ఇప్పటి పిల్లలు తమలాగా పెద్దలు చూపించినవారిని మౌనంగా చేసేసుకోరు. వారంతట వారు మాట్లాడి, పరిచయం పెంచుకుని ఎన్నిక చేసుకోవాలి. ఈ సంగతి ఆమెకు తెలుసు. కానీ అలా అని ఇన్ని నెలలపాటు అడ్డు, అదుపు లేకుండా తిరిగి, తీరా వాళ్ళు నాకు నచ్చలేదు అని అంటే మర్యాదగా వుండదు కదా అని ఆమె బాధపడుతోంది.

"ఇవాళ ఆ విషయమే మాట్లాడుకున్నాం అమ్మా!" అన్నాడు అంబర్.

"అవునా? మరి ఏమని నిర్ణయించుకున్నారు?" ఆతురతగా అడిగింది పార్వతి. కొడుకు నోటి వెంట ఆ శుభవార్త ఎప్పుడెప్పుడు వింటానా అని ఆమెకు చాలా తహతహగా వుంది.

"ఏమీ లేదు. స్వీటీకి ఇష్టమే అనుకుంటాను. కానీ నాకే పూర్తిగా సమ్మతిగా లేదు" నెమ్మదిగా అన్నాడు అంబర్.

"లేదా? సరే, నీకు నచ్చలేదు అంటే ఇంక మేము ఏం అంటాం? కానీ కొంచెం practical గా ఆలోచించి ఎందుకు వద్దని అంటున్నావో సరిగ్గా తేల్చుకో. రూపం నచ్చలేదా?" తన నిరుత్సాహాన్ని పైకి కనిపించనీయకుండా నెమ్మదిగా అడిగింది పార్వతి. పొంగే పాలమీద నీళ్ళు చల్లినట్లుగా వుంది ఆమె పరిస్థితి.

"లేదమ్మా! స్వీటీ చాలా అందంగా వుంది".

"మరి గుణం నచ్చలేదా? మీ ఇద్దరి interest లు కలవలేదా?"

"గుణం, interest ల ప్రసక్తి కాదమ్మా. అవన్నీ బాగానే వున్నాయి".

"మరింకేం కారణం అంబర్?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది పార్వతి.

"ఎందుకో ఆ అమ్మాయితో నాకు click కాలేదమ్మా!" నెమ్మదిగా అన్నాడు అంబర్.

"క్లిక్కా? అంటే ఏమిటి? రూపం బాగుంది, గుణం కూడా బాగుంది అంటున్నావు. చదువు, family ముందే బాగున్నాయని మనందరికీ తెలిసిన విషయమే! ఇంకా ఈ click కాకపోవటం ఏమిటిరా?" అయోమయంగా అడిగింది పార్వతి. అంబర్ మాటలు అర్థం కాక ఆమెకి నిజంగానే మతి పోతోంది.

అది ఏమిటో విడమరిచి చెప్పటానికి అంబర్ కే అసలు clear picture లేదు. అన్నీ బాగానే వున్నా, స్వీటీని చూసినా, కలిసినా, మాట్లాడినా, ఈ అమ్మాయే తనకి కావాలని, ఈ అమ్మాయి కోసమే తను ఇన్నేళ్ళూ ఎదురుచూసిందని తన మనసుకు అనిపించటంలేదు. అది పైకి ఎలా చెప్పాలో తెలియటంలేదు అతనికి. ఒకవేళ కష్టపడి చెప్పినా తల్లితండ్రులకి అర్థం అవుతుందన్న నమ్మకం అతనికి లేదు. ఈ confusion ఎలా తీర్చాలో అతనికి తెలియటంలేదు. ఎందుకంటే అతనికే అసలు పెద్ద confusion గా వుంది.

పార్వతికి ఇలాంటి incident ఇంకోటి, ఆమధ్య జరిగింది, గుర్తు వచ్చింది. ఏదో పెళ్ళిసంబంధం వుంది, అమ్మాయి bank లో పని చేస్తోంది, చూడటానికి చాలా బాగుంటుంది అని ఎవరో చెప్తే అంబర్ తండ్రితో కలిసి bank కి వెళ్ళాడు ఆ అమ్మాయిని చూడటానికి. తీరా ఇంటికి వచ్చిన తర్వాత ఆతురతగా ఇంట్లో ఎదురు చూస్తున్న పార్వతితో నచ్చలేదని చెప్పాడు అంబర్. ఆ తర్వాత "సన్నగా లేదు" అన్నాడు నిరుత్సాహంగా.

"సన్నమా? సన్నంగానే వుందిగా? ఇంకా ఏం సన్నం? రేపు ఇంట్లో పనిపాటలు చేసుకోవటానికి ఏమన్నా ఓపిక వుండాలా? లేక గట్టిగా గాలి వీస్తే పడిపోయేంత పుల్లలాగా వుండాలా? కొంచెం realistic గా ఆలోచించు" అంటూ తండ్రి విసుక్కున్నాడు అంబర్ మీద.

"అంబర్! పోనీ గోవర్ధనం అంకుల్ సంగతి ఇంకోసారి ఆలోచించు. మీ నాన్న చాలా సంతోషిస్తారు" అంది పార్వతి భోజనం ముగించి కుర్చీలో కూర్చుంటున్న కొడుకుతో. గోవర్ధనంగారు, రావుగారు చిన్నప్పటి నుండీ స్నేహితులు. పిల్లలు పెద్దవారైన తర్వాత వియ్యమంది ఆ స్నేహాన్ని ఇంకా గట్టి పరచుకోవాలని వారిద్దరికీ పెళ్ళి కాకముందునుండీ ఎప్పుడూ అనుకునేవారు. కానీ కాలేజీ చదువైన తర్వాత గోవర్ధనంగారు అమెరికా వెళ్ళిపోయారు. అయినా చాలామంది లాగా సంపద, అతిశయం ఆయన స్నేహాన్ని భంగపరచలేదు. చేసిన వాగ్దానాలను మరిచిపోయేలాగా

చేయలేదు. అమెరికా నుండి ఇన్నేళ్ళబట్టీ ఎప్పుడికప్పుడు ఫోన్లు చేస్తూ, ఉత్తరాలు రాస్తూ స్నేహితునితో touch లోనే వున్నారు. కానీ వారిద్దరూ ముచ్చటపడి చేసుకున్న వాగ్దానాన్ని అమలులో పెట్టడానికి మాత్రం అసలు మనిషి అంబర్ అడ్డు వచ్చాడు. "అమెరికా సంబంధం నాకు వద్దు నాన్నా! నా స్వశక్తితో నేను విదేశాలు వెళ్ళాలి కానీ పెళ్ళాం ద్వారా వెళ్ళటం నాకిష్టం లేదు" అన్నాడు. పైకి చెప్పలేదు కానీ అలా వెళితే ఆ అమ్మాయి, వారి కుటుంబ సభ్యుల దృష్టిలో తనెక్కడ చులకన అయిపోతానేమోనని అతని భయం. అంతేకాక అమెరికాలో పుట్టి పెరిగిన పిల్ల అణగిమణగి వుంటుందో లేదోనని కూడా అతని సందేహం.

"ఈ అర్థంపర్థం లేని స్వాతిశయం పెట్టుకోకు. మా గోవర్ధనం నీకు తెలుసు. ఎంత simple మనిషో, ఎంత మంచివాడో నువ్వే అనేకసార్లు కలిసావు. వాడి కూతురుని కూడా ఇన్నేళ్ళబట్టీ చూస్తూనే వున్నావు. మాట్లాడుతూనే వున్నావు. ఎంత మంచిగా, మర్యాదగా వుంది ఆ అమ్మాయి? గర్వం, పొగరు వున్నట్లుగా ఎప్పుడైనా అనిపించిందా నీకు? నీ సందేహాలన్నీ కేవలం నిరాధారాలు మాత్రమే!" అన్నాడు తండ్రి. ఆయన ప్రశ్నలకి అంబర్ ఏమీ సమాధానం చెప్పలేదు. 'నా స్వశక్తి వల్ల తప్ప పెళ్ళాం ద్వారా మాత్రం నేను చచ్చినా అమెరికా వెళ్ళను' అని మాత్రం గట్టిగా మనసులో నిర్ణయించుకున్నాడు. పైకి మాత్రం "అమ్మా! charted accountant గా బాగా పేరు తెచ్చుకుంటున్నాను. ఇంత చిన్న వయసులోనే బాగా సంపాదించి settle అవుతున్నాను. ఇప్పుడు ఇవన్నీ వదిలేసి అమెరికా వెళ్ళి మళ్ళీ ఓనమాలతో జీవితం మొదలెట్టమంటావా?" విసుక్కుంటున్నట్లు అన్నాడు తల్లితో. పార్వతి ఏమీ మాట్లాడలేదు. ప్రతీదానికీ ఏదో ఒకటి చెప్తున్నాడు, వీడికి ఏ పిల్ల నచ్చుతుంది? పెళ్ళెలా అవుతుంది? అని ఆలోచిస్తోంది ఆవిడ.

ఇంకొక సంబంధం వచ్చింది. అమ్మాయి nutrition లో పి హెచ్ డి చేస్తోంది. కానీ పి హెచ్ డి చదివిన అమ్మాయి తనకి వద్దన్నాడు అంబర్. "నాకంటే నా భార్య ఎక్కువ చదివినా, నాకంటే ఎక్కువ సంపాదించినా నాకేమీ problem లేదు. నామీద నాకు ఆమాత్రం self-confidence లేకపోలేదు. కానీ ఆ అమ్మాయి స్వభావం ఏమిటో? ఇప్పుడు ఏవో కారణాలవల్ల ఒప్పుకున్నా భవిష్యత్తులో తెలియని పరిస్థితుల ప్రభావం వల్ల సరిపెట్టుకోలేక పోవచ్చు. నాలాగా PHD లేనివాడిని ఎందుకు ఒప్పుకున్నానా అని అప్పుడు బాధపడచ్చు. అందుకని వద్దు" అన్నాడు అంబర్. లోకం గొడ్డుపోయిందా, ఈ అమ్మాయి కాకపోతే ఇంకొక అమ్మాయి అనుకున్నాడు మనసులో.

ఇంకొక సంబంధం. వివరాలన్నీ బాగున్నాయి. ఆ అమ్మాయితో ఒక నెలరోజులపాటు మాట్లాడాడు కూడాను. ఇదేదో అవుతుందేమోనని అందరూ ఆశ పడుతున్న తరుణంలో వద్దనేసాడు అంబర్. "ఆ అమ్మాయి attitude నాకు నచ్చలేదు. చాలా independent గా వుంది. ప్రతీదానికీ parasite లాగా ఇతరులమీద ఆధారపడాలని నేను అనను కానీ మరీ ఇంత independent గా కూడా వుండకూడదు. పైగా ఇంక పెళ్ళైన మరునాటి నుండీ నేను, నా మొగుడు ఒకటి, తక్కినవారంతా పరాయివారు అనుకునే స్వభావంలాగా వుంది. నాతోపాటు నావారు కూడా తనవారే అనుకునే అమ్మాయి కావాలి, నా కుటుంబంలో కలిసిపోయే అమ్మాయి కావాలి కానీ ఇలా కుటుంబ విలువలని గౌరవించలేని అమ్మాయి నాకు వద్దు" అన్నాడు అంబర్. తల్లితండ్రులు ఇంకేమంటారు? ఏమీ అనలేకపోయారు. 'అయ్యో' అనుకుని నిట్టూర్చారు.

ఇంకొకసారి ఇంకొక అమ్మాయితో మాట్లాడటం మొదలుపెట్టాడు అంబర్. వారానికి ఒకసారి కలవటంతో మొదలయి రెండు రోజులకి ఒకసారి కలవటం దాకా పరిచయం పెరిగింది. వారాలు, నెలలు గడుస్తున్నాయి. కానీ అంబర్ మాత్రం అస్తమానూ 'ఇంకా ఏదీ నిర్ణయించుకోలేదు' అనేవాడు. చూసి చూసి ఇంక విసుగొచ్చి ఒకరోజు రావుగారు అన్నారు, "అంబర్! ఒక మనిషితో ఎంత ఎక్కువ సమయం గడిపితే వారి గురించి అంత ఎక్కువ తెలుస్తుంది అని అనుకుంటున్నావు కాబోలు. ప్రతీసారీ అది నిజం అవ్వాలనిలేదు. ఎంత తెలిసినా ఒక మనిషి గురించి మనకి తెలియని విషయాలు ఎప్పుడూ వుండనే వుంటాయి. అమెరికా లాంటి దేశాలలో పెళ్ళికి ముందే కొంతమంది కలిసి జీవిస్తారట. అయినా పెళ్ళైన మరునాడే divorce లంటారు. దాన్నేమంటావు? ముందు మనకి ఏం కావాలి అన్నది clear గా ఆలోచించుకోవాలి. ఆ కోరికల లిస్టు ఎంత సింపుల్ గా, practical గా వుంటే అంత తేలికగా, తొందరగా అన్వేషణ ముగిసే అవకాశం వుంది. లేటు అయిన కొద్దీ ఒక్కొక్కసారి పరిస్థితులు ఇంకా complicated గా అవుతాయి. అసలు ఎంత జాగ్రత్తగా వున్నా పెళ్ళి అన్నది చీకట్లోకి బాణం వేయటం వంటిది. ఎంత ఏకాగ్రత చూపించినా అదృష్టం వుంటే గురి తగులుతుంది, లేకపోతే లేదు" ఎంతో అనుభవంతో సహనంగా చెప్పారు.

అంబర్ ఏమీ అనలేదు. ఒక వారంరోజుల తర్వాత మాత్రం 'ఆ అమ్మాయికి నో అని చెప్పేసాను' అన్నాడు. కారణం ఎందుకో మాత్రం చెప్పలేదు. అడిగితే ఏమనుకుంటాడో అని తల్లితండ్రులు కూడా ఏమీ అడగలేదు. ఆ టైం రాలేదు, మనదేం వుంది అని ఎంత సరిపెట్టుకోవాలనుకున్నా, మరి అయినవారికి, కనీసం అప్పుడప్పుడన్నా బాధగా వుంటుంది కదా! ఏవన్నా లోపాలు వుండటం వలన పెళ్ళిళ్ళు కుదరటంలేదు అంటే అర్థం వుంది. కానీ అన్నీ వుండి కూడా ఏదీ

కుదరటం లేదేమిటి? ఇంకా ఆ ఘడియ ఎప్పుడు వస్తుంది? అని వాళ్ళు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ఆ టైంలో వాళ్ళు మరిచిపోయినదేమిటంటే కొన్నికొన్నిసార్లు అన్నీ వుండటమే అన్నిటినీ మించిన లోపం. ఎందుకంటే అన్నీ వున్నవారి expectations కూడా చాలా ఎక్కువగా వుంటాయి. మరి ఏదో ఒక దానికన్నా సరిపెట్టుకోవటానికి సిద్ధంగా లేకపోతే, ఇదిగో, ఇలాగే పెళ్ళిళ్ళు కుదరటం ఆలస్యం అవుతుంది. అసలు ఈ రోజుల్లో పిల్లల్లో ఈ సరిపెట్టుకోవటం అన్నది చాలా తక్కువైపోతోంది. 'మాకేం తక్కువ? మేం ఎందుకు సరిపెట్టుకోవాలి? అన్నీ వున్నవారు వచ్చేదాకా మేం వేచి వుండగలం, కానీ ఇష్టం లేని విషయాలకి సరిపెట్టుకోవాల్సిన అవసరం మాకేముంది? పెళ్ళి కావటం ఆలస్యం అయినా కూడా ఫరవాలేదు, అసలు ఆ మాట కొస్తే పెళ్ళి కాకపోయినా కూడా ఫరవాలేదు. కానీ ఏవిధమైన అసంతృప్తితో మాత్రం పెళ్ళికి సిద్ధపడం' అని అంటారే తప్ప అసలు ఈ ప్రపంచంలో ఏ బంధం అయినా compromise మీదే ఆధారపడి వుందన్న సత్యాన్ని వారు గ్రహించరు. వారు వూహించుకుని, కలలుగని, ఆశపడ్డ Mr.Perfect, Miss.Perfect ఈ ధరణిలో ఎవ్వరూ వుండరన్న చేదు నిజాన్ని, నగ్న సత్యాన్ని వారు ఒప్పుకోరు. మనిషన్న ప్రతీవారికీ ఏదో ఒక లోపం వుంటుంది. ఈ చేదు నిజాలను నిజాలుగా ఒప్పుకోవటానికి వారికి వారి అహం అడ్డు వస్తుంది.

*　　　*　　　*

పెళ్ళి పందిరి కళకళలాడుతోంది. సన్నాయి మేళం వీనుల విందుగా మారుమ్రోగుతోంది. అందరూ హడావిడిగా తిరుగుతున్నారు. అందరి ముఖాల్లోనూ excitement, సంతోషం, సరదా వుట్టిపడుతున్నాయి. పెళ్ళి పీటల మీద వధూవరులిద్దరూ కూర్చుని పురోహితుడు చెప్తున్నట్టు ఏవో పూజలు చేస్తున్నారు. ఆహ్వానితులలో కొంతమంది శ్రద్ధగా ఈ తంతు అంతా చూస్తున్నారు. ఇంకొంతమంది వారివారి పనులలో నిమగ్నమయ్యారు. మరి కొంతమంది కబుర్లలో మునిగిపోయారు.

"వధూవరులిద్దరూ కొంచెం వయసు ముదిరినవారిలాగా కనిపిస్తున్నారు కదూ!" అంటోంది ఒకావిడ.

"అవును. చాలా ఏళ్ళ బట్టీ చూస్తున్నారుట సంబంధాలు. బహుశా అన్నిటికీ ఏవో వంకలు పెట్టి ఆలస్యం చేసుకుని వుంటారు. ఈ రోజుల్లో పిల్లల తీరు చూస్తూనే వున్నాంగా!" అంటూ ఇంకొకావిడ వూహించేసింది.

"అమ్మాయి కొంచెం లావుగా వుంది కూడాను" అసంతృప్తిగా అంది ఒకావిడ.

'అమ్మాయి dance చేసి ప్రదర్శనలిచ్చేదిట. అది మానేయగానే ఒళ్ళు వచ్చేసిందట. పాపం, అందుకే ఏ సంబంధమూ కుదరక వాళ్ళు అమెరికాలో వుంటున్నా, చివరికి ఇండియా సంబంధం ఒప్పుకున్నారుట" ఇంకొకావిడ తనకి తెలిసిందంతా చెప్పేసింది.

"అబ్బాయికి వెనకాల జుట్టంతా వూడిపోయి పూర్తిగా బట్టతల అయిపోయింది" ఒకావిడ చాలా అసంతృప్తిగా అంది.

"పోనీలెండి. బట్టతల అని ముందు నుంచి ఏమీ తెలియటం లేదుగా! ముఖం బాగానే అనిపిస్తోందిగా! వెనకాల కాస్త జుట్టు వూడితే మాత్రం ఏం నష్టం వుంది?" ఆమాత్రమన్నా సరిపెట్టుకోలేకపోతే ఎలాగ అన్నట్టు ఇంకొకావిడ వెంటనే సమాధానం చెప్పేసింది.

"అబ్బాయి ఒక్కడే కొడుకనుకుంటాను. మరి ఈ వయసులో వున్న తల్లితండ్రులని ఇక్కడే వదిలేసి అమెరికా వెళ్ళిపోతే వాళ్ళను ఇంకెవరు చూస్తారు? " అడిగింది ఒకావిడ.

"ఏమో! అసలు ఎవరో ఒకరు చూడాలని ఏముంది? ఇంక అలా అనుకుంటే పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి? అమెరికా వెళ్ళే అవకాశం వదులుకుంటారా ఎవరైనా?" అని తిరుగు ప్రశ్న వేసింది ఇంకొకావిడ.

"అమ్మాయేమో అమెరికాలో. అబ్బాయేమో ఇండియాలో. అసలు ఎలా కలిసింది వీళ్ళిద్దరికీ? ఈ రోజుల్లో పిల్లలు మాట్లాడాలంటారు, కనీసం కొన్ని రోజులపాటన్నా కలిసి తిరగాలంటారు. మరి వీళ్ళిద్దరికీ అదెలా సాధ్యమైంది?" ఆశ్చర్యంగా ఆరా తీసింది ఇంకొకావిడ.

"అమ్మాయివాళ్ళ వివరాలన్నీ internet లో చూసి అబ్బాయి contact చేసాడుట. చాలా రోజులు అలా correspondence చేసుకుని, చివరకు అమ్మాయివాళ్ళు ఇండియా వచ్చినపుడు చూసి, ఇష్టపడి చేసుకుంటున్నారు. ఈ రోజుల్లో internet ద్వారా అవని పనులంటూ ఏవీ లేవు. చివరికి పెళ్ళిళ్ళు కూడా ఇట్టే కుదిరిపోతున్నాయి" అని తనకి తెలిసినదంతా చెప్పేసింది ఇంకొకావిడ.

"చాలరోజులు అమ్మాయి ఇండియా సంబంధం వద్దని, అబ్బాయేమో అమెరికా వెళ్ళనని చాలా సంబంధాలు వద్దనుకున్నారుట. తీరా బాగా ఆలస్యం అయి, వయసు ఎక్కువైపోతోందని సరిపెట్టుకుని ఇంక సరే అనుకున్నారనుకుంటాను. ఇంతకీ రాసిపెట్టి వుంది. ఆ టైం వస్తే తావలచింది రంభ, తామునిగింది గంగ అన్నట్లుగా ముందు వద్దు అనుకున్నవారే ఇట్టే అన్నిటికీ ఒప్పుకుంటారు. ఇదే ప్రాప్తం అంటే!" అని తీర్మానించింది ఇంకొకావిడ.

ఇంతలో మంగళసూత్రధారణ సమయం వచ్చింది. అందరూ సంతోషంగా వధూవరుల వైపు చూస్తున్నారు. వారిపై వేయటానికి అందరి చేతుల్లోనూ అక్షింతలు వున్నాయి.

అంబర్ సితార మెడలో మూడు ముళ్ళూ వేస్తున్నాడు.